భోగి మంటలు..
సంక్రాంతి వేడుకలు

నియోజకవర్గ వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని కాలనీలు, బస్తీల్లో భోగి మంటలు వేశారు. అదే విధంగా చిన్నారులు, పెద్దలు గాలి పటాలు ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు. పలు కాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. – కుత్బుల్లాపూర్


జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో భోగి మంటలు వేస్తున్న కాలనీవాసులు


శంభీపూర్‌లో గాలిపటం ఎగుర వేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు


ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న సృజన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు


చింతల్ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన బండి శ్యామ్‌గౌడ్


మైసమ్మనగర్‌లో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

వేంకటేశ్వరస్వామి ప్రసాదం అందజేత


లీడర్ నర్సింహారెడ్డికి తిరుపతి లడ్డూను అందజేసిన రామారావు

నిజాంపేట్: లైఫ్ లైన్ ఫౌండేషన్ తెలంగాణ ఇన్‌చార్జ్ దామా రామారావు నేతృత్వంలో ఆదివారం టీటీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు లీడర్ నర్సింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు తిరుమల తిరుపతి స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి


యూనియన్ల నాయకులతో సమావేశమైన చింతల నాగరాజు

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. ఆదివారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమల యూనియన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. సెక్టార్ల వారీగా కార్మిక సంఘ నాయకులు చేపట్టాల్సిన ప్రచారంపై ఆయన దిశానిర్దేశనం చేశారు.

జంక్షన్ బాక్స్‌ను పునరుద్ధరించాలి


జీడిమెట్ల సీఐకు వినతి పత్రం అందజేస్తున్న భగత్‌సింగ్‌నగర్‌వాసులు

చింతల్: ప్రజా బాధ్యతలు – హక్కుల చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి అల్లా బకాష్ ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ నాయకులు ఆదివారం జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ ప్రజల సహకారంతో భగత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల జంక్షన్ బాక్స్ బిగించిన కరెంటు పోల్ కింద పడిపోవడంతో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం సమీపంలో మూడు కెమెరాలు పని చేయడం లేదన్నారు. జంక్షన్ బాక్స్‌ను పునరుద్ధరించి కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐకు వినతి ప్రతం అందజేశారు. అదే విధంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయనను శాలువతో సత్కరించారు. కాలనీ నాయకులు గురువారెడ్డి, నారాయణరెడ్డి, మల్లేష్, నందు, కృష్ణారెడ్డి, చిన్న లింగయ్య, జాన్సన్‌బాబు, బిస్వల్లి రాజు, యాదగిరి, శేఖర్ తదితరులు ఉన్నారు.

మేయర్ నీలారెడ్డికి అభినందనలు


మేయర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్–23 అవార్డు వచ్చిన నేపథ్యంలో ఆదివారం కార్పొరేటర్ మేకల వెంకటేష్, కో.ఆప్షన్ సభ్యుడు తలారి వీరేష్ ఆధ్వర్యంలో మేయర్ కొలన్ నీలారెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... కార్పొరేషన్‌ను పరిశుభ్రంగా ఉంచే విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే అవార్డు సాకారమైందన్నారు.

చెట్లపొదల్లో మహిళ మృతదేహం లభ్యం


మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

సుభాష్‌నగర్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సూరారం శివాలయనగర్‌లోని శ్రీదర్గాభవానీ ఆలయం సమీపంలోని గుడిసెల వెనుక చెట్ల పొదల్లో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మహిళ మృతదేహం గుర్తు పట్టకుండా ఉందని, ఎవరైనా హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

60వేల కుటుంబాలకు రామయ్య అక్షింతలు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాకెన హరీష్‌రావు, హాజరైన స్థానిక కాలనీల ప్రజలు

నిజాంపేట్: అయోధ్య రామాలయం ప్రారంభం .. సంక్రాంతి ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం ప్రగతినగర్‌లోని ఎన్టీఆర్ పార్కులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ కూకట్‌పల్లి జిల్లా ప్రచార ప్రముఖ్ మాకెన హరీష్‌రావు సంక్రాంతి ప్రాముఖ్యత, సూర్యభగవానుడి ఆరాధన, రామ జన్మభూమి అక్షతల వితరణ, ప్రాణప్రతిష్ఠ తదితర అంశాలపై వివరించారు. ప్రపంచం మొత్తం భారతదేశాన్ని అనుసరిస్తోందన్నారు. రానున్న కాలంలో భారతదేశం విశ్వ గురువుగా ఆవిర్భవించనుందన్నారు. అంతకుముందు ప్రగతినగర్‌లోని పది బస్తీలలో జరిగిన శ్రీరామజన్మభూమి అక్షతల వితరణ జనసంపర్కం నివేదికను నగర సంఘచాలక్ తాడేపల్లి నాగేంద్రకుమార్ అందించారు. దాదాపు 60వేల కుటుంబాలకు అక్షతల వితరణ జరిగిందన్నారు. వెయ్యి మంది రామసేవకులుగా మారి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు.

‘హనుమ ధ్వజ’కు భలే డిమాండ్


జగద్గిరిగుట్ట ప్రధాన రహదారిలో అమ్మకానికి జెండాలు

జై శ్రీరాం... జై హనుమాన్.. జెండాలకు భలే క్రేజ్ ఏర్పడింది. ప్రతీ ఇంటికి శ్రీ రాముడి అక్షింతలు చేర్చాలన్న సంకల్పంతో రాజకీయాలకు అతీతంగా అందరూ తిరుగుతుండటంతో ఈ జెండాలకు క్రేజీ ఏర్పడింది. జగద్గిరిగుట్టలోని పలు షాపులతో పాటు చింతల్, షాపూర్‌నగర్, సూరారం తదితర ప్రాంతాలలో ఈ జెండాలను విక్రయిస్తున్నారు. గత వారం నుంచి అమ్మకాలు బాగా ఉన్నాయని వ్యాపారస్తులు తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు ఈ అమ్మకాలు ఇంకా జోరందుకుంటాయని ముందే స్టాక్ తెచ్చుకున్నట్లు వారు తెలిపారు. – జగద్గిరిగుట్ట

జాతీయ సమైక్యతా శిబిరం ప్రారంభం

దుండిగల్: కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ జాతీయ సేవా పథకం హైదరాబాద్ రీజినల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఆదివారం దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో వారం రోజుల పాటు జరిగే జాతీయ సమైక్యతా శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని జేఎన్టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.మంజూర్ హుస్సేన్, ఎంఎల్ఆర్ఐటీ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే, కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

◆ జేఎన్టీయూ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ మాట్లాడుతూ.. సమైక్యతా శిబిరాల్లో పాల్గొనడం విద్యార్థులకు గొప్ప అవకాశమన్నారు. ఇలాంటి శిబిరాలతో ఇతర రాష్ట్రాల్లో ఉండే సంస్కృతి సంప్రదాయాలు తెలుసుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. కళాశాల కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజ సేవలో విద్యార్థులు పాలు పంచుకునేలా తాము ప్రోత్సహిస్తునే ఉంటామన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం శ్రీరంగవరం గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించామని తెలిపారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్: చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లిలోని చెరువులో ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం నీటిపై తేలింది. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుని వయసు 30–35 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. అతడికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడా లేక ఆత్మహత్యకు పాల్పడ్డా అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉచితంగా జనరల్ మెడిసిన్ కిట్ల పంపిణీ



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో హెల్పింగ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జనరల్ మెడిసిన్ కిట్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. అశోక చక్ర వివంతు వికలాంగుల సంక్షేమ సంఘం వారికి నెలకు సంబంధించిన మెడిసిన్ కిట్ (జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్ల నొప్పులు తదితర మందులు)ను అందజేశారు. అ రోజు మొదలు పెట్టిన ఈ మెడికల్ కిట్ ప్రతీ నెల కొనసాగుతుందని హెల్పింగ్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులులు టూటే విజయ్ కుమార్ అన్నారు. మెదటి నెల తన తండ్రి పదవ వర్ధంతి సందర్భంగా తన వంతుగా ఈ మెడికల్ కిట్‌కు సహకరించిన శామ్యూల్ జాన్‌కు ప్రత్యేక దన్యవాదాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ సత్యనారాయణ ఈ మందులపై అవగాహన కల్పించారు. అశోక చక్ర సంఘం అధ్యక్షుడు ఏసుబాబు, సాజిద్, శ్రావణ్‌కుమార్, దేవి, సాత్విక, అర్చన, అరుణ్, బాబురావు, విజయ్, రేఖ, కరుణ, మంజుల, వీరేందర్ తదితరుల హాజరయ్యారు.


సూరారం పరిధిలోని వెంకట్రాంనగర్‌లో ఆదివారం స్థానిక వెంకటేశ్వరాలయంలో గోదాకల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం


పద్మానగర్ ఫేజ్-1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ఆలయాలలో ఆదివారం గోదాదేవి కల్యాణం వైభవంగా జరిపారు. డివిజన్ పరిధిలోని కొండపై ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, గోవిందరాజస్వామి ఆలయాలు, పద్మానగర్ ఫేజ్-1లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సూరారం కాలనీలోని వాసుదేవాశ్రమంలో ఆదివారం గోదాదేవి రంగనాథస్వాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. – జగద్గిరిగుట్ట


జగద్గిరిగుట్ట కొండపై ఉన్న గోవిందరాజస్వామి ఆలయంలో..


వాసుదేవాశ్రమంలో జరిగిన గోదాదేవి రంగనాథస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు